
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
శుక్రవారం 20 జూన్ 2025





ద్వాక్రా మహిళలకు రూ.5కోట్ల మెగా చెక్కును అందజేస్తున్న యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ లక్ష్మీతులసి తదితరులు

చెరువు కబ్జాకు స్కెచ్

- రూ.25 కోట్ల స్థలం కొట్టేసే యత్నం
- వైసీపీ హయాంలోనే కబ్జాకు అడుగులు
- నాడు ఆంధ్రజ్యోతి కథనంతో బ్రేక్
- నేడు మళ్లీ పావులు కదుపుతున్న వైనం



ఆక్రమణకు గురవుతున్న కొప్పర్తి చెరువు స్థలం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరానికి ఆనుకుని ఉన్న చింతకొమ్మదిన్నె మండల పరిధిలో కొప్పర్తి చెరువు 270 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనికింద ఆయకట్టు 237 ఎకరాలు ఉంది. ఈ చెరువు పక్కనే కొప్పర్తి పారిశ్రామికవాడ వచ్చింది. ఇక్కడ పలు చిన్న చిన్న కంపెనీలు యూనిట్లు స్థాపిస్తున్నాయి. వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి అభివృద్ధికి ముందడుగు పడింది. ఇక్కడ మరో బ్లాక్‌ను అభివృద్ధి చేయనున్నారు. సోమశిల బ్యాక్‌వాటర్ నుంచి 0.60 టీఎంసీల నీటిని కొప్పర్తి పారిశ్రామికవాడకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో కొప్పర్తి పారిశ్రామికవాడ ప్రాంతంలో భూములకు రెక్కలు వచ్చాయి.

ఆ భూమిపై కన్ను

కడప-పులివెందుల ప్రధాన రహదారిలో రేడియో స్టేషన్‌కు దగ్గరలో కొప్పర్తి చెరువు ఉంది. ఈ ప్రాంతం ఇటు నగరానికి, అటు పారిశ్రామికవాడకు దగ్గరగా ఉంటుంది. ఇప్పుడు అక్కడ ఎకరం సుమారు రూ.3 కోట్లు పలుకుతోంది. ఇంత విలువైన స్థలాన్ని నాలుగేళ్ల క్రితమే అంటే 2021 ఫిబ్రవరి 27న కబ్జా చేసేందుకు ప్లాన్ చేయగా 'కొప్పర్తి చెరువుకు స్పాట్' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. అప్పట్లో ఇది పెద్ద సంచలనంగా మారింది. దీంతో కబ్జాకు బ్రేక్ పడింది. వైసీపీ అధికారం కోల్పోయి టీడీపీ అధికారం చేపట్టాక తిరిగి కొప్పర్తి చెరువు కబ్జాకు అడుగులు పడుతున్నాయి. నీటి మునక, చెరువు తట్టు ప్రాంతాల్లో ఎలాంటి పట్టాలు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఒకప్పుడు ఈ ఏరియాకు అంత విలువ ఉండేదికాదు. ఎనిమిదేళ్ల నుంచి విలువ వచ్చింది. దీంతో ఇక్కడ నీటిమునక భూమిపై కబ్జాల్లో ఆరితేరిన బ్యాచ్ కన్నేసింది. వైసీపీ హయాంలో ఆంధ్రజ్యోతి కథనంతో బ్రేక్ పడింది. ఇప్పుడు రికార్డులనే ట్యాంపరింగ్ చేసి తమ పూర్వీకుల పేరుతో ఉన్నట్లు తయారు చేసి మరోమారు కబ్జాకు తెరలేపారు. సుమారు రూ.25 కోట్ల విలువ చేసే 8.50 ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నారు. ఇక్కడ విశేషమేమంటే ఇదే చోట 2014-2019లో రూ.5,85,109 ఖర్చు పెట్టి ఉపాధి ద్వారా మూడు ఎకరాల్లో చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2021 మార్చి 26వ తేదీ వరకు కూడా నిర్మాణం ఉండేది. కబ్జాదారులు ఈ స్థలం తమదంటూ చెత్త సంపద కేంద్రాన్ని కూడా కూల్చేశారు. అయినా కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం విశేషం.



చెరువు స్థలంలో రూ.5.80 లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రం.. దీనిని నాలుగేళ్ల క్రితమే కబ్జాదారులు నేలమట్టం చేశారు

> వైసీపీలో కబ్జాదారులుగా ముద్రపడ్డ కొందరు ఎన్నికల ముందు.. ఆ తరువాత టీడీపీలోకి ఎంట్రీ అయ్యారు. ఎవరిని ఎలా మెప్పించాలో వీరికి తెలుసు. ఇలా పార్టీలోకి వచ్చిన వారిదే ఇక్కడ హవా నడుస్తోంది. వీరు చేసే అరాచకాలు టీడీపీకి డ్యామేజీ అయినప్పటికీ.. వీరికి ఆశ్రయం ఇచ్చిన వారు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి పరిస్థితి జిల్లాలో కడప, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉంది. బి.మఠంలో అయితే టీడీపీ, వైసీపీ నేతలు భాయి భాయి అంటూ టీడీపీలో చేరి అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకుంటున్నారు. ఇదే పరిస్థితి అన్ని చోట్లా ఉంది. తాజాగా కొప్పర్తి చెరువులో దాదాపు రూ.25కోట్ల విలువ చేసే 8.5 ఎకరాల స్థలం కబ్జాకు గురవుతోంది.

ఈ విషయాన్ని ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా కొప్పర్తి చెరువు ఆక్రమణకు గురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సర్వే చేసి చెరువు సరిహద్దులు గుర్తించాల్సిందిగా ఆర్డీవో, తహశీల్దార్‌కు లేఖ రాశామన్నారు. ఈ విషయమై సీకేదిన్నె తహశీల్దారు నాగేశ్వరరావును వివరణ కోరగా, కబ్జా చేసిన స్థలాన్ని పరిశీలిస్తామన్నారు.

ఇంటిల్లిపాదికీ యోగానందం



యోగా కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మన దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే ఇంటిల్లిపాదికి యోగానందం, ఆరోగ్యభాగ్యం సొంతం అవుతాయని కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కడప స్టేట్ గెస్ట్‌హౌస్ ఎదుట మీడియా మిత్రులు, కడప నగర పాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో ఫ్యామిలీ యోగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ.. యోగా సాధనతో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డీఐ పీఆర్వో పద్మజ, కేఎంసీ అదనపు కమిషనరు రాకేశ్‌చంద్ర, జిల్లాకు చెందిన అన్ని మీడియా మిత్రుల కుటుంబాల సభ్యులు, పలువురు ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చాపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే రుణాలతో డ్వాక్రా మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని యూనియన్ బ్యాంకు కడప శాఖ రీజినల్ మేనేజర్ లక్ష్మీతులసి అన్నారు. చాపాడులోని వెలుగు కార్యాలయంలో గురువారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు రూ.5 కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కును కడప డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, బ్యాంకు మేనేజర్ వెంకటరమణ, వెలుగు ఏపీఎం శ్రీధర్‌తో కలసి లక్ష్మీతులసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల చదువుల కోసం రూ.40 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. రైతులకు ట్రాక్టర్లు, కారు, మోటారు సైకిళ్లకోసం రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ కోసం ప్రీమియం చెల్లిస్తే బాధిత కుటుంబాలకు భరోసా లభిస్తుందన్నారు. ఇచ్చిన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మహిళ ఏదో ఒక చేతిపని వృత్తిలో నైపుణ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుబ్బరత్న, డ్వాక్రా మహిళలు, లీడర్లు పాల్గొన్నారు.

వైవీయూ దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ కృష్ణారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ దూరవిద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, ఉప సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబుతో కలిసి గురువారం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ ఏడాది మార్చి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించామన్నారు. మొత్తం 8 విభాగాలలో పరీక్షలు నిర్వహించగా ఎకనామిక్స్ 88.8 శాతం, ఇంగ్లీష్ 96.6, హిస్టరీ 66.6, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం 100, పొలిటికల్ సైన్స్ 100, సైకాలజీ 100, స్పెషల్ తెలుగు 86.3, కామర్స్ 90.9శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం 144 మంది పరీక్షలురాయగా అందులో 136 మంది ఉత్తీర్ణత సాధించారని ఇందులో 104 మంది ఫస్ట్‌క్లాస్, 32 మంది సెకండ్ క్లాస్‌లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో దూర విద్య కేంద్రం సిబ్బంది టి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాజశేఖర్, ఎస్.జబీబుల్లా, కె.కనకరత్నమ్మ పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్విన ప్రాంతం పరిశీలన

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దువ్వూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం సమీపంలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను గనులు, భూగర్భశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాధ, స్థానిక తహశీల్దారు సంజీవరెడ్డి, ఆర్‌ఐ జాన్సన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. వీరు వెళ్లేసరికి ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు తవ్వకాల వద్ద నుంచి వెళ్లిపోయాయి. గురువారం ఆంధ్రజ్యోతిలో 'కప్పం కట్టాల్సిందే' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన గనులు, భూగర్భశాఖ అధికారి స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి సర్వే నంబర్లు 139, 142లో గురువారం పరిశీలన చేశారు. ఆ ప్రాంతమంతా కలియ తిరిగారు. చిన్నసింగనపల్లె వీఆర్వో వెంకటేశ్వర్లు, అక్కడి గ్రామ సర్వేయరు శ్రీహరితో తవ్వకాలు జరిగిన విస్తీర్ణాన్ని కొలతలు వేయించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడే ఉన్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి వచ్చి రిపోర్టు తయారు చేసి తహశీల్దారు సంజీవరెడ్డితోపాటు సిబ్బందితో సంతకాలు చేయించుకున్నారు. పరిశీలించిన విషయాలు చెప్పమని ఆంధ్రజ్యోతి కోరగా రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నిరాకరించి వెళ్లిపోయారు.



తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు



తవ్వకాలు జరిగిన ప్రాంతంలో టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు లేకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

రీ వెరిఫికేషన్‌లోనూ అన్యాయమే

- 10వ తరగతి విద్యార్థిని తండ్రి ఆవేదన



మాట్లాడుతున్న నున్నా రాజేంద్రప్రసాద్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకనంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంగా మార్చుతోందని, పదవతరగతి సమాధాన పత్రాల రీ వెరిఫికేషన్‌లోనూ తమకు అన్యాయం జరిగిందని నున్నా రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ కుమార్తె ఎన్.గురుభవానికి 10వ తరగతిలో 561 మార్కులు వచ్చాయన్నారు. అన్ని సబ్జెక్టులలో 95కుపైగా మార్కులు రాగా సైన్స్‌లో 84 వచ్చాయని తెలిపారు. అనుమానం వచ్చి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేశామన్నారు. సైన్స్ పేపర్-2లో 36 మార్కులు వచ్చాయని తెలిపారు. పీడీఎఫ్ కాపీని తమకు ఇచ్చారని, సమాధాన పత్రంలో 17బి 12 మార్కుల ప్రశ్నకు సమాధానం రాసినా దానికి మార్కులే వేయలేదన్నారు. రీ వెరిఫికేషన్ పెట్టినా ఆ సమాధానానికి మార్కులు వేయలేదన్నారు. దానికి మార్కులు వేసి ఉంటే తమ కుమార్తెకు మరో 10 మార్కులు పెరిగేవన్నారు. ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులు పునర్‌మూల్యాంకనంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. స్వయంగా ఎస్ఎస్‌సీ బోర్డు కార్యాలయానికి వెళ్లి సమస్యను విన్నవించినా న్యాయం జరగకపోవడం, అధికారుల బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ స్పందించి తమ కుమార్తె సమాధాన పత్రాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

రైతులకోసం ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్

కడప కలెక్టరేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం మొదలైన సంక్షేమ పథకాలు పొందే విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ధారించిన రుసుము రూ.500 మినహాయింపు ఇచ్చామని పేర్కొన్నారు. కేవలం రూ.50 సంబంధిత గ్రామ సచివాలయంలో చెల్లిస్తే జాయింట్ పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేస్తారని వివరించారు. ఇది జూన్ 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

- జిల్లాలో 24 శిక్షణ కేంద్రాలు
- శిక్షణానంతరం కుట్టుమిషన్లు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

7

అయినవారే వదిలేసి వెళ్లారు..

- మంటకలిసిన మానవత్వం

7

పల్లె పండుగ బకాయిలు రూ.86కోట్లు

6

టీడీపీ జెండాలు చింపిన కేసులో నిందితులకు కర్నూలులో వైద్యపరీక్షలు

- ఆదేశించిన హైకోర్టు

పులివెందుల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలు చింపివేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న ఆరుగురికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఓబుళరెడ్డి అనే న్యాయవాది పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి హైకోర్టు ఉత్తర్వులను ఎస్ఐ విష్ణునారాయణకు అందించారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ.. గత నెల 28వ తేదీన టీడీపీ జెండాలను, ఫ్లెక్సీలను చించివేసిన ఘటనపై పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. నిందితులకు అప్పట్లో పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించామన్నారు. అయితే మళ్లీ వైద్య పరీక్షలు చేయించాలని, అది కూడా కడప జిల్లాలో కాకుండా వేరే జిల్లాలో చేయించాలని పార్నపల్లె కిషోర్, సాగుపాటి రాజేశ్, కావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లె వెంకటచలపతి, సాతుపాటి వెంకటపతిలు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో ఈ ఆరుగురికి కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రిలో రీఎగ్జామినేషన్ చేయించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు గురువారం 11.10గంటల ప్రాంతంలో పులివెందుల కోర్టు నుంచి లాయర్ వచ్చి హైకోర్టు ఉత్తర్వులు అందించారన్నారు. సాయంత్రం 6గంటలకు ఆ ఆరుగురిని కర్నూలు ఆసుపత్రికి వైద్యపరీక్షల నిమిత్తం పంపించామన్నారు.

ఆర్డీవో సంచలన నిర్ణయం

- తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు
- వారికిచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసిన ఆర్డీవో
- వృద్ధ దంపతులకు పత్రాలు అందజేత



గిఫ్ట్ డీడ్ రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వృద్ధ దంపతులకు అందజేస్తున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తల్లిదండ్రుల నుంచి గిఫ్ట్‌డీడ్‌గా ఆస్తిని పొంది అనంతరం వారిని పట్టించుకోని పిల్లలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గిఫ్ట్‌డీడ్‌ను రద్దు చేసి ఆ పత్రాలను వృద్ధ తల్లిదండ్రులకు అందజేశారు. వివరాలు ఇలా..

ప్రొద్దుటూరు పట్టణం రంగయ్యగారి సత్రంవీధికి చెందిన మాలేపాటి మోహన్‌రావు (86), మాలేపాటి గౌరమ్మ (75) దంపతులు సొంతంగా స్వీట్స్ వ్యాపారం నడుపుతూ జీవించేశారు. వీరికి ఐదుగురు కుమార్తెలు. వయో భారం, ఆరోగ్య సమస్యల కారణంగా స్వీట్స్ వ్యాపారం వదిలేశారు. తమ కుమార్తెల మాటలు నమ్మి గత ఏడాది జూలై 23న తాముంటున్న ఇంటిని గిఫ్ట్‌డీడ్ ద్వారా వారికి బదలాయించారు. ఆస్తి బదిలీ అయిన తర్వాత కుమార్తెలు వీరిని పట్టించుకోవడం మానేశారు. తిండి, దుస్తులు, వైద్య సాయం అందించకపోవడంతో పొరుగు వారిపైన, సేవా సంస్థలపైన ఆధారపడాల్సి వచ్చింది. చివరికి వృద్ధాశ్రమంలో చేరారు. దీంతో వృద్ధ దంపతులు ఇద్దరూ ఆర్డీవో సాయిశ్రీని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న విచారణకు హాజరు కావాలంటూ వృద్ధ దంపతుల ఐదుగురు కుమార్తెలకు ఆర్డీవో సాయిశ్రీ నోటీసులు ఇచ్చారు. వారు విచారణకు రాలేదు. మరో రెండుసార్లు విచారణకు పిలిచినా వారు రాలేదు. దీంతో వృద్ధ దంపతులు ఇచ్చిన ఆధారాలు, వారికున్న అనారోగ్య సమస్యల కారణంగా గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేస్తూ ఆర్డీవ ఉత్తర్వులు ఇచ్చారు.

ఇక నుంచి ఆ ఆస్తి మోహన్‌రావు యాజమాన్యంలోకి వస్తుందని, ఐదుగురు కుమార్తెలు ఆ ఇంటిని 15 రోజుల్లో ఖాళీ చేసి మోహన్‌రావు దంపతులకు అప్పగించాలని, దీనిని ప్రొద్దుటూరు తహశీల్దారు పర్యవేక్షించాలని ఆర్డీవో ఆదేశించారు. ఉత్తర్వులు పాటించకపోతే మూడు నెలల జైలుశిక్ష లేదా రూ.5వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ ఉత్తర్వుతో ఎవరైనా అసంతృప్తి చెందితే కలెక్టర్ ముందు 30 రోజుల్లో అప్పీలు దాఖలు చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో మాలేపాటి మోహన్‌రావు, మాలేపాటి గౌరమ్మ దంపతులకు గిఫ్ట్ డీడ్ రద్దు చేసిన పత్రాలను ఆర్డీవో సాయిశ్రీ అందజేశారు. దీంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణకు మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్టు 2007 చట్టంలోని సెక్షన్ 23 ఆదుకుంటుందన్నారు. తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ఆస్తులు తీసుకుని పట్టించుకోకుండా వదిలేసేవారిని ఈ చట్టం ఉపేక్షించదన్నారు.

నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

- ఆధిపత్య పోరుతో ఆరు నెలలుగా నిలిచిన వైనం
- ఈసారైనా సజావుగా జరిగేనా



కడప ఎర్రముక్కపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కడప నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం శుక్రవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య జరగనుంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, మేయర్ సురేశ్‌బాబు మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు కారణంగా ఆరు నెలలుగా కార్పొరేషన్ జనరల్‌బాడీ సమావేశం జరగలేదు. గతంలో జరిగిన సర్వసభ్య సమావేశాల్లో మేయర్‌కు ఇరువైపులా ఎక్స్‌అఫీషియో సభ్యులైన కమలాపురం, కడప ఎమ్మెల్యేలకు కుర్చీలు వేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన రెండో సమావేశంలో మేయర్‌కు ఇరువైపులా ఉన్న ఎక్స్‌అఫీషియో సభ్యుల కుర్చీలను తొలగించారు. ఇక్కడే అసలైన గొడవ ప్రారంభమైంది. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి గతంలో జరిగిన విధంగానే కొనసాగించాలని పట్టుబట్టారు. దీనిపై మేయర్ స్పందిస్తూ ఈ సంప్రదాయం ఎక్కడా లేదని, మేయర్‌కు ఒక్కరికే కుర్చీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇది చిలికి చిలికి గాలివానగా మారింది. తర్వాత నిర్వహించిన సమావేశాన్ని సక్రమంగా జరగకుండా ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకున్నారు. మేయర్ తన కుటుంబ సభ్యులకు కార్పొరేషన్ పరిధిలో కాంట్రాక్ట్ పనులు అప్పగించారని ఇది నిబంధనలకు విరుద్ధమని ఎమ్మెల్యే ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించి ఇది వాస్తవమని తేల్చడంతో.. మేయర్‌ను పదవినుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై మేయర్ సురేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో ఇచ్చింది.

హైకోర్టు ఆదేశాలతో..

ఇదిలా ఉండగా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్వసభ్య సమావేశం నిర్వహించాలని కార్పొరేటర్లు ఎస్పీ, జేసీలకు వినతిపత్రాలు సమర్పించారు. సజావుగా కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగేలా భద్రత ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే వీరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో హైకోర్టు స్పందిస్తూ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి గట్టి భద్రత కల్పించాలని ఆదేశించింది. సమావేశ మందిరంలోకి ఎన్నికైన ప్రతినిధులు, ఎక్స్ అఫీషియల్ సభ్యులు, అవసరమైన రెగ్యులర్ సిబ్బందిని మాత్రమే అనుమతించాలని సూచించింది. ఏదిఏమైనా శుక్రవారం సర్వసభ్య సమావేశం సజావుగా జరగాలని, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలని, కార్పొరేషన్ అభివృద్ధిబాటలో సాగాలని పలువురు కోరుకుంటున్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు : డీఎస్పీ

కడప క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరగనున్న కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 53 మంది ఏఎస్ఐలు, 110 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 4 స్పెషల్ పార్టీలు బందోబస్తు విధుల్లో ఉంటారని అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరా, నేత్ర, వజ్ర వాహనం ద్వారా నిఘా ఉంచుతామన్నారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై విచారణ



అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పీలేరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ మల్లారపు వాండ్లపల్లె నల్లగుట్ట క్రాసు హౌసింగ్ కాలనీలో ఉన్న డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ ఎంఆర్పీఎస్ నాయకులు గురువారం ఉదయం ఆ ఘటనపై కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో కలకడ ఇన్‌చార్జ్ సీఐ ప్రసాద్‌బాబు, తహసీల్దారు నరేంద్రకుమార్, ఎస్ఐ చిన్నరెడ్డప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించి దెబ్బతిన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై కేవీపల్లెకు చెందిన ఏపీఎంఆర్పీఎస్ నేత ముల్లంగి చంద్రయ్య మాట్లాడుతూ నల్లగుట్ట వద్ద గత ప్రభుత్వ హయాంలో దళితులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేశారని, ఆ సమయంలోనే తాము అక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా కొందరు అగ్రవర్ణాల వారు కాలనీ, అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని ఆయన తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ, తహసీల్దారు మాట్లాడుతూ తగిన విచారణ జరిపి, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని దళిత సంఘ నాయకులకు హామీ ఇచ్చారు.

యోగాంధ్రకు సిద్ధంగా ఉండాలి: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులతో ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగాను ప్రజల జీవితంలో భాగస్వామ్యం చేసినప్పుడే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైనట్లు అవుతుందన్నారు. నెల రోజులుగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉందని అధికారులు, సిబ్బంది వలనే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఈ నెల 21న రాయచోటిలో 5 వేల మందితో దేవాంతర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగ బకాయిలు రూ.86 కోట్లు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు
- అప్పులపాలైన టీడీపీ నాయకులు



రామసముద్రం మండలం వాల్మీశ్వరస్వామి కొండపై అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టండి... ఏజెన్సీల చేత పనులు చేయించే బాధ్యత పీఆర్ ఏఈలు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులదే.. లక్ష్యాలను చేరుకోకుంటే జీతాలు నిలిపివేస్తాం అంటూ జిల్లా ఉన్నతాధికారులు మండలస్థాయి అధికారులను వెంటబడ్డారు. కింది స్థాయి అధికారులేమో టీడీపీ నాయకులను బతిమలాడి పల్లెపండుగ పనులు చేయించారు. ఇప్పుడు చూస్తే నాలుగు నెలలవుతున్నా చేసిన పనులకు బిల్లులు పడలేదు. అప్పులు చేసి కాంట్రాక్టు పనులు చేసిన టీడీపీ నాయకులు అధికారుల మీద పడుతున్నారు. వారేమో తప్పించుకుని తిరుగుతున్నారు. ఇదీ జిల్లా వ్యాప్తంగా పల్లెపండుగ కార్యక్రమంలో నిర్వహించిన పనులపై సుమారు రు.86 కోట్ల బకాయిల సంగతి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నమయ్య జిల్లాకు పల్లెపండుగ కార్యక్రమానికి రూ.63 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద సీసీ రోడ్లు, పశువులకు నీటి తొట్టెలు, మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టారు. కేవలం ఏజెన్సీల చేత ఈ పనులు చేయించాలని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నాయకులు చోటామోటా కాంట్రాక్టర్లుగా మారి అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. రైతులు వారి పొలాలు, ఇళ్ల వద్ద నీటితొట్టెలు, మినీ గోకులాలు నిర్మించుకున్నారు. మొదటి విడత కొంతమందికి బిల్లులు పడ్డాయి కానీ ఆ తర్వాత చాలామందికి పడలేదు. ఇక కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి సీసీ రోడ్ల పనులు చేసిన టీడీపీ నాయకులు చేసిన పనులకు బిల్లులు పడక అప్పుల పాలయ్యారు. ముఖ్యంగా గ్రామాల్లో అయితే వందల సంఖ్యలో టీడీపీ నాయకులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో మూడు నెలలుగా జిల్లాలో ఎక్కువ ప్రాంతాల్లో పల్లెపండుగ పనులు నిలిపివేశారు. కనీసం పార్టు బిల్లులు పడితేనే పనులు పూర్తి చేస్తామని టీడీపీ నాయకులు, ఏజెన్సీలు మొండికేసి కూర్చున్నారు.

తారురోడ్లకు రూ.50 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌కు రూ.36 కోట్ల బకాయిలు



మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్యకొండపై నిలిచిపోయిన రోడ్డు పనులు

జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ పనుల కింద పల్లెపండుగ కార్యక్రమంలో 1206 నీటితొట్టెలు మంజూరు కాగా వాటిలో 1171 నీటితొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. 1240 మినీ గోకులాలు మంజూరు కాగా వాటిలో 1175 మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేశారు. 842 సీసీ రోడ్లు మంజూరు కాగా 601 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి 2024-25 మార్చి వరకు రూ.35.16 కోట్ల బకాయిలు అలాగే ఉన్నాయి. ఇవి కాక ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ 10వ తేది వరకు చేసిన పనుల బిల్లులు వీటికి అదనం.

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రూ.50 కోట్లు

జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పల్లె పండుగ కార్యక్రమాల్లో తారు రోడ్లు, వెట్ మిక్సింగ్ రోడ్లు, కంకర రోడ్లు, పాఠశాలల ప్రహరీగోడల నిర్మాణాలు చేపట్టారు. జనవరిలో సంక్రాంతి వరకు కాంట్రాక్టర్లకు అంతో ఇంతో బిల్లులు పడ్డాయి. కానీ తర్వాత ఎక్కువశాతం పనులకు బిల్లులు పెండింగ్ పెట్టేశారు. ఉదాహరణకు మదనపల్లె నియోజక వర్గంలోని రామసముద్రం మండలం వాలీశ్వర స్వామి కొండపైకి రూ.2.06 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం, మదనపల్లె మండలంలో వేంపల్లె మల్లయ్యకొండపైకి రూ.1.05 కోట్లతో కొత్త రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. పెద్ద మొత్తంలో ఉన్న ఈ పనుల్లో టీడీపీ నాయకులు రోడ్డు ఫార్మేషన్‌కే ఎక్కువ ఖర్చు పెట్టారు. కానీ వారికి ఇంతవరకు బిల్లులు పడలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిపివేశారు. ఇకపోతే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేసి వాటిని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చేత అట్టహాసంగా ప్రారంభింపజేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ఇంతవరకు వారికి బిల్లులు చెల్లించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ నాయకులు (కాంట్రాక్టర్లు) వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఈ నెలాఖరుకు బిల్లులు రావచ్చు

జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్ ఆధ్వర్యంలో పనులు నిర్వహించాము. వీటిలో రూ.40 నుంచి 50 కోట్ల వరకు పీఆర్ శాఖ పనులకు బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. ఈనెలాఖరులోగా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయొచ్చు. ఆదేశాలు వచ్చిన వెంటనే అందరికీ బిల్లులు చెల్లిస్తాం.

- దయాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రాయచోటి



కోళ్లబైలు పంచాయతీ వన్నూర్‌సాబ్ గుట్టపై నిర్మించిన సీసీరోడ్డు

దాడిచేసిన డిజిటల్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు

- బాధిత కుటుంబానికి అన్ని విధాలా న్యాయం
- సచివాలయంలో ఘటనకు... ప్రభుత్వం తరపున సారీ..
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



గుమ్మసముద్రం సచివాలయ ఘటనలో గాయపడిన వ్యక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

బి.కొత్తకోట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగి చేసిన పనికి ప్రభుత్వం తరపున సారీ.. మీ కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేస్తాం.. మీ రెండవ బిడ్డకు కూడా తల్లికివందనం నిధులు పడేలా చూస్తాం.. మిమ్మల్ని అవమానించి, గాయపరిచిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.. జరిగిన ఘటనకు చింతిస్తున్నాం... అంటూ సాక్షాత్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆ కుటుంబాన్ని ఓదారుస్తూ హామీ నిచ్చారు.

బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ సచివాలయంలో బుధవారం జరిగిన ఘర్షణలో ఓ కుటుంబంపై స్థానిక డిజిటల్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్ దాడి చేయడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడి, కేసు నమోదైన విషయం తెలిసిందే. సమాచారం అందగానే ఘటనపై విచారణాధికారిగా మదనపల్లి సబ్‌కలెక్టర్‌ను నియమించి పూర్తి వివరాలను కలెక్టర్ తెప్పించుకున్నారు. గురువారం హార్సిలీహిల్స్ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో గుమ్మసముద్రం ఘటన బాధితులను కలసి మాట్లాడేందుకు జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి గండువారిపల్లికి విచ్చేశారు. కలెక్టర్ హోదాలో సచివాలయంలో కూర్చుని ఘటనపై విచారణ చేసి, బాధితులను అక్కడికే రప్పించుకుంటారని అందరూ భావించారు. అయితే ఆయన గండువారిపల్లికి వెళ్లి బాధితుల నివాసంలో శంకరప్ప, అనురాధ, నాగభూషణంలతో నేరుగా మాట్లాడారు. జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగి దాడి చేసిన తీరును, తమకు జరిగిన అవమానాన్ని వివరిస్తూ శంకర, అనురాధలు కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాధితుల వైద్య ఖర్చులను స్వయంగా భరిస్తానని, పెండింగ్‌లో ఉన్న పక్కాగృహానికి రూ.70 వేలు అదనపు సాయం అందేలా చూస్తానని, తల్లికి వందనం నిధులు పడేలా చూస్తామన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులను సమావేశపరిచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎంపీడీవో క్రిష్ణవేణిని ఆదేశించారు. అనంతరం గ్రామస్థులు పలు సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. తమ గ్రామంలో రీసర్వే సమయంలో జాయింట్ ఎల్పీఎం పెట్టడంతో 1బి రావడం లేదని, పలువురికి తల్లికివందనం నిధులు పడలేదని గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ నెల 25న గ్రామంలో గ్రామసభ నిర్వహించి, అర్జీలను తీసుకుంటామని రైతులకు సంబంధించిన అన్ని సమస్యలను తీరుస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సీఐ జీవన్‌గంగనాథబాబు, ఎంపీడీవో క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ తొలగింపు

రాజంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గతంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై అశ్రద్ధ వహించిన గత మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరర్‌రావు సస్పెన్షన్‌ను తొలగిస్తూ మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ రాజంపేటలో కమిషనర్‌గా నియమించారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ రాబడి విషయంలోనూ, ఇంటింటి సర్వేలోనూ ఇతరత్ర మున్సిపాలిటీ నిర్దేశిత లక్ష్యాల్లోనూ నాగేశ్వరరావు అలసత్వం చూపుతున్నారని పేర్కొంటూ ఆయనను బదిలీ చేస్తూ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం శ్రీనివాసులు పని చేస్తున్నారు. అయితే బదిలీపై వెళ్లి సస్పెన్షన్‌కు గురైన నాగేశ్వరరావు మరో పది నెలల్లో పదవి విరమణ వయస్సు పూర్తి కానందున తమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఉన్నతాధికారులను అభ్యర్థించారు. నాగేశ్వరరావు అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రెవెన్యూ రాబడి, ఇతర ప్రాధాన్యతలేని పోస్టులో నాగేశ్వరరావును కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తూ ప్రాధాన్యత లేని పోస్టులో త్వరలో ఆయనను నియమించనున్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం

- కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన ఇంజనీరింగ్ కార్మికులు



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ అన్నారు. గురువారం ఆయన ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు 15 సంవత్సరాల నుంచి జీతాలు పెంచకపోగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంజనీరింగ్ కార్మికులకు వర్తించవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదేవిధంగా టెక్నికల్ వారికి రూ.29,200 జీతాలు ఇవ్వాలని, నాన్ టెక్నికల్ వారికి రూ.24,500 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఆ జీవోలో వర్తింపజేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే జీతాలు పెంచకపోతే సమ్మెలోకి వెళతామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి, రమణ, కమిటీ సభ్యులు రమణ, వెంకట్రమణ, దర్బార్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై త్రిసభ్య కమిటీ విచారణ



మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్న అగ్రికల్చర్ ఏడీ నాగరాజు



తల్లి రాక కోసం ఎదురుచూస్తున్న చిన్నారులు

సిద్దవటం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తెలిసిందే. కాగా ఈ విషయంపై త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని బద్వేల్ అగ్రికల్చర్ ఏడీ నాగరాజు గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాల విషయమై త్రిసభ్య కమిటీలో డీఎస్పీ, ఆర్డీవో, అగ్రికల్చర్ ఏడీ ముగ్గురు విచారించి నిర్ధారణ చేస్తామన్నారు. రైతు అప్పులు చేసిన ప్రామిసరి నోటీసు, బాండ్లు, పంట పొలాల ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే తగిన న్యాయం చేస్తామన్నారు. వీరి వెంట గ్రామస్థులు, వ్యవసాయశాఖ సిబ్బంది, మండల వీఆర్వో సంటయ్య, వీఆర్ఏ కిషోర్, ఎంపీటీసీ ప్రతినిధి శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కాగా మృతుడి తండ్రి మునిరెడ్డి వారితో మాట్లాడుతూ తాము సొంత పొలంతో పాటు మరో ఐదు ఎకరాల్లో పంటలు సాగు చేసేవారమని, పంటల సాగుకు దాదాపు రూ.25 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. వేరుశనగ, పసుపు, ఉల్లి, పట్టుపరిశ్రమ సాగు, పంటల్లో నష్టం రావడంతో మనస్థాపంతో తన కుమారుడు, కోడలు జూన్ 9న తిరుపతికి వెళుతున్నామని చెప్పి కడప వాచం పల్లె బస్టాండ్ వద్ద ఓ ఎరువుల దుకాణంలో రసాయనిక మందులు కొనుగోలు చేశారన్నారు. ఈ నెల 10న తిరుపతిలోని లాడ్జిలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లగా వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించామన్నారు. ఈ ఘటనలో కుమారుడు నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా, కోడలు పుష్పవేణి చికిత్స తీసుకుంటోందని తెలిపారు. కాగా మండలంలోని డేగనవారిపల్లె గ్రామంలో స్వగృహం వద్ద మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి మృతితో పిల్లలు జి.లావణ్య, నాగేంద్ర దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

హమాలీల మధ్య ఘర్షణ

- రెండు కాలనీల్లో తీవ్ర ఉద్రిక్తత
- అదనపు బలగాలతో పోలీసు పికెట్‌లు ఏర్పాటు
- మూడు గంటలపాటు పోలీసు స్టేషన్ ముందు హంగామా
- నేడు మార్కెట్‌లో హమాలీలు ప్రవేశించకుండా పోలీసుల చర్యలు



దాడులకు పాల్పడకుండా అడ్డుగా నిలబడిన పోలీసులు

కలికిరి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులోని టమోట మార్కెట్‌లో హమాలీల మధ్య మొదలైన గొడవ తీవ్ర ఘర్షణగా మారి చివరకు రెండు కాలనీల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. ఒక వైపు పోలీసులు ఉదయం నుంచి సర్దుబాటు చేస్తుండగా సయోధ్య కుదిరిందని ఊపిరి పీల్చుకున్న తరువాత సాయంత్రం 6 గంటల నుంచి మొత్తం వ్యవహారం రెండు వర్గాల మధ్య దాడులు, ప్రతి దాడులకు సిద్ధమైంది. వివరాలిలా... రెండు కాలనీలకు చెందిన దాదాపు 350 మంది ఏళ్ల తరబడి స్థానిక టమోట మార్కెట్‌లో హమాలీలుగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం మార్కెట్‌లో టమోటాలను సర్దుబాటు చేసే ప్రయత్నంలో హమాలీ తీసుకొస్తున్న ఒక ఖాళీ బాక్సు జారి మరో హమాలీ కాలి మీద పడింది. దీంతో బాధితునికి ఆ హమాలీ క్షమాపణ చెప్పి తనపనిలో నిమగ్నమయ్యాడు. ఆ తరువాత కొంత సేపటికి బాధిత హమాలీ తరఫున నలుగురైదుగురు వచ్చి బాక్సు పడేసిన హమాలీపై దురుసుగా ప్రవర్తించారు. ఇది వాగ్వివాదంతో మొదలై చివరికి ఒకరినొకరు కొట్టుకునే వరకూ వెళ్లింది. ఈ దశలో పలువురు వ్యాపారులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. పరిస్థితి శ్రుతి మించుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే మార్కెట్‌కు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. ఇది మళ్లీ పునరావృతం కాకుండా చేసేందుకు తరువాత స్టేషనుకు రావాలని ఇరువర్గాలకు సూచించారు.

ఈ నేపథ్యంలో ఒక వర్గానికి చెందిన దాదాపు రెండు వందల మంది సాయంకాల స్టేషను వద్ద పోగయ్యారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వారిలో కొందరిని కూర్చోబెట్టి సర్దుబాటు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇది జరుగుతుండగానే మరో వర్గానికి చెందిన ఇంకో హమాలీ మార్కెట్ వైపు నుంచి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చి కేకలు వేస్తూ చేతిలో కొడవలి చూపిస్తూ మోటారు సైకిల్‌పై పోలీసుస్టేషను చేరుకున్నాడు. అక్కడ కూడా తిరిగి కొడవలి చూపిస్తూ వీరంగం చేయడంతో అప్పటికే అక్కడున్న మరో వర్గం హమాలీలు రెచ్చిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కొడవలితో వచ్చిన వ్యక్తిని బంధించి స్టేషన్ లోపలికి తీసుకెళ్లారు. ఈ సంఘటనతో బయట వున్న వందల మంది హమాలీలు రెచ్చిపోయారు. ఇదిలా వుండగానే అంతా ఒక కొలిక్కి వస్తున్నదని, మరో వర్గం హమాలీలను కూడా పిలిపించాలని పోలీసులు ప్రయత్నిస్తుండగానే అక్కడున్న హమాలీలు మోటారు సైకిళ్లు తీసుకుని మరో వర్గం హమాలీలకు చెందిన కాలనీపై దాడికి ప్రయత్నించారు. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వీరిని వెంబడిస్తూ కాలనీ వైపు పరుగులు తీశారు. మరో వైపు కాలనీ వాసుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు రోడ్డు పైకి వచ్చి మరో వర్గం హమాలీల దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. దాడులకు ప్రయత్నించిన హమాలీలను పోలీసులు చెదరగొట్టి తరిమేశారు.

పోలీసు సిబ్బంది బయట ప్రాంతాలకు బందోబస్తు డ్యూటీకి వెళ్లడంతో స్థానిక పోలీసులకు రెండువర్గాల దాడులను అడ్డుకోవడం సమస్యగా మారింది. ఎట్టకేలకు రాత్రి పీలేరు సీఐ యుగంధర్, కేవీపల్లె ఎస్ఐ చిన్నరెడ్డెయ్యలు తమ పోలీసు బలగాలను తీసుకొచ్చి ఉద్రిక్తతను తాత్కాలికంగా తగ్గించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా కేంద్రం నుంచి స్పెషల్ పోలీసులు కూడా కలికిరి చేరుకుంటున్నారు. కాగా ఒక దశలో శుక్రవారం టమోట మార్కెట్‌ను మూసివేయాలని పోలీసులు నిర్ణయించారు. అయితే రైతులు ఇబ్బంది పడతారనే ఆలోచనతో రెండు వర్గాలకు చెందిన హమాలీలను మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తున్నట్లు కలికిరి సీఐ తెలిపారు. కాలనీల పైకి పరస్పర దాడులకు పాల్పడ కుండా అన్ని చోట్ల రాత్రికి పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

వాల్మీకిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతలవారిపల్లె గ్రామానికి చెందిన కె.బొజ్జమ్మ(80) అనే వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేదు. ఆమె భర్త, కుమార్తె చాలా రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె బాగోగులను అల్లుడు వెంకటరమణ చూసుకుంటున్నాడు. గురువారం ఈయన తన అత్తను ఇంటి వద్దనే వదిలి బంధువుల అంత్యక్రియల నిమిత్తం వేరే ఊరికి వెళ్లాడు. అదే సమయంలో బొజ్జమ్మ చింతలవారిపల్లె గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి పాకాల నుంచి గుంతకల్లుకు వెళ్తున్న రైలుకింద పడి తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటనను గుర్తించిన స్థానికులు ఆమెను హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందింది. కదిరి రైల్వే ఎస్ఐ రహీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రైలు ఢీకొని మృతిచెందిన వృద్ధురాలు

మద్యం లారీ బోల్తా - తృటిలో తప్పిన ప్రమాదం

పెనగలూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లె చెక్‌పోస్టు సమీపంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో మద్యం లారీ బోల్తా పడింది. లారీ నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీలో తీసుకెళుతున్న సరకుకు పెద్దగా నష్టం జరగలేదు. చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి లారీ బోల్తా పడినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ సరకు చిట్వేలి మండంలోని వైన్‌షాపునకు వెళుతున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే పెనగలూరు మద్యం షాపుల నిర్వహణ భాగస్థులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అలాగే బెస్తపల్లె సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్న పెనగలూరు పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కూడా సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

- జిల్లాలో 24 శిక్షణ కేంద్రాలు
- శిక్షణానంతరం కుట్టుమిషన్లు
- మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి దుస్తుల తయారీలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న వివిధ రకాల మోడల్ డ్రెస్సులను తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 24 శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి శిక్షణ కేంద్రంలో 144 మందికి శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషను ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు అనుగుణంగా శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన 15,594 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో తొలివిడతగా 3068 మందికి అవకాశం కల్పించారు. కుట్టు శిక్షణ కేంద్రంలో రోజుకు రెండు పూటలా రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు హాజరైన



కడప హౌసింగ్‌బోర్డు కాలనీలో శిక్షణ నేర్చుకుంటున్న మహిళలు

వారందరికీ డిజిటల్ అటెండెన్స్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. ఈ హాజరు 75 శాతం ఉంటేనే ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుంది.

వందల మంది కుట్టు శిక్షణ వైపు...

జిల్లాలోని 24 శిక్షణ కేంద్రాల్లో ప్రతిరోజూ వందలాది మంది మహిళలు ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో నూతన మెలకువలతో తయారు చేసిన దుస్తులకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇంట్లో పనిచేసుకుంటూ కుట్టు మిషన్ల ద్వారా జీవనోపాదులను కల్పించుకోవడానికి అవకాశం ఉంటుందనే ఆలోచనతో చాలా మంది మహిళలు కుట్టుశిక్షణ వైపు దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వం కూడా కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయకుండా వారికి కుట్టుమిషన్లు కూడా అందించడం పట్ల మహిళల్లో చాలా మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



90 రోజుల పాటు శిక్షణ

జిల్లాలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు మొదలు పెట్టాం. ఈ కార్యక్రమం 90 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ శిక్షణలో దాదాపు 70 రోజుల పాటు ఆసక్తకరంగా నేర్చుకున్నవారికి కుట్టుమిషన్లు ఇవ్వనున్నాం. ఈ బ్యాచ్‌లు అయిపో గానే తిరిగి నూతన బ్యాచ్‌లు ఏర్పాటు చేసేందు కు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-జయసింహ, ఈడీ, బీసీ కార్పొరేషన్

టైలరింగ్ ద్వారా ఉపాధి



ఉచిత కుట్టు శిక్షణ ద్వారా టైలరింగ్ నేర్చుకుంటు న్నాను. ఈ శిక్షణతో ఉపాధి కలుగుతుందని ఒక నమ్మకం ఏర్పడింది. మహిళల్లో ఆర్థిక అభివృద్ధిని పెంపొందించి బతుకుదెరువుకు భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

-సునంద, ఎర్రగుంట్ల

ఇలాంటి శిక్షణతో జీవనోపాధి



మహిళల్లో ఆదాయ వనరులు పెంపొందించడానికి కుట్టు శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరం. ఈ శిక్షణ వల్ల నాకు నా కుటుంబానికి ఉపాధి దొరుకుతుందనే నమ్మకం ఏర్పడింది. సాటి మహిళలకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

-స్వప్న, బెల్లంమండీవీధి, కడప

కడప, నెల్లూరు జట్ల శుభారంభం

- ఏసీఏ సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి టీ20 క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీ20 పోటీల్లో కడప, నెల్లూరు జట్లు శుభారంభం చేశాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)ఆధ్వర్యంలో గురువారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తొలుత కడప, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 210పరుగులు చేసింది. వంశీకృష్ణ 61బంతుల్లో 10బౌండరీలు, నాలుగు సిక్సర్లతో 98పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ జహీర్ అబ్బాస్ 64పరుగులు చేశాడు. అనంతంరం బరిలోకి దిగిన కర్నూలు 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 165పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. కడప బౌలర్లు అరీఫ్‌బాషా 3, ధృవకుమార్ రెడ్డి 2వికెట్లు పడగొట్టారు. అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 19.4ఓవర్లలో 158పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ అర్జున్ టెండూల్కర్ 78పరుగులతో జిల్లాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. నెల్లూరు బౌలర్ భరత్ 5వికెట్లు పడగొట్టాడు. కడప 18.5ఓవర్లలోనే 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటర్ రేవంత్‌రెడ్డి 86పరుగులు, ఫర్మాద్‌ఖాద్రి 56 పరుగులు సాధించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కడపలో గల వివిధ స్టేడియంలలో ఈనెల 22వ తేదీ నుంచి జూలై 10 వరకు ఏసీఏ సౌత్ జోన్ అండర్-19 మెన్ మల్టీడే (మూడురోజుల మ్యాచ్) క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ పోటీల్లో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం జట్లు తలపడనున్నాయి. అందులో భాగంగా 22 నుంచి 24 వరకు కర్నూలు - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు నుంచి కడప-చిత్తూరు జట్ల మధ్య మరో మ్యాచ్ ఉంటుంది. 25న ఆటకు విశ్రాంతి దినం. అలాగే 26 నుంచి 28 వరకు కడప-కర్నూలు, అనంతపురం - నెల్లూరు, 29న విశ్రాంతి, 30 నుంచి జూలై 2 వరకు అనంతపురం- చిత్తూరు, అదేరోజు కడప- నెల్లూరు, జూలై 3న విశ్రాంతి, 4 నుంచి 6 వరకు చిత్తూరు- నెల్లూరు, అనంతపురం - కర్నూలు, 7న విశ్రాంతి, 8 నుంచి 10 వరకు అనంతపురం- కడప, చిత్తూరు-కడప జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పై మ్యాచ్‌లన్నీ వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంతో పాటు కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతాయని రెడ్డి ప్రసాద్ తెలిపారు.

22న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 7-30 గంటలకు అండర్-16, అండర్-14 పురుషుల జిల్లా క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలి పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ (ఫారం-5), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన నరేంద్రరెడ్డి

పులివెందుల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి చెందిన నరేంద్రరెడ్డి (35), కుళాయప్ప అనే వ్యక్తితో కలిసి బైకుపై పులివెందులకు వస్తున్నారు. పులివెందుల నుంచి ముదిగుబ్బ వైపు వెళ్తున్న కారు వీరి బైకును ఢీకొంది. దీంతో నరేంద్రరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా కుళాయప్ప గాయపడ్డారు. మృతిచెందిన నరేంద్రరెడ్డి పొలం పనులకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న మాలేపాటి సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ సురేం ద్రరెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిబాబా కొట్టాలకు చెందిన సుదర్శన్ గురువారం స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్లో గంజాయి విక్ర యిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఇతని వద్ద నుంచి 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుదర్శన్ నెల్లూరులో ఒక వ్యక్తి నుంచి గంజాయి కొను గో లు చేసేవాడు. వీటిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి పట్ట ణంలో విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు.



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన దృశ్యం

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుర్రంకొండ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు నాగార్జున (30) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ గజేంద్ర తెలిపారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ టి.గొల్లపల్లెకు చెందిన గంగులమ్మ కుమార్తె అశ్వినికి కదిరి నియోజకవర్గం గాండ్లపెంటకు చెందిన రమణ కుమారుడు నాగార్జునతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో కొంత కాలంగా అతను అత్తగారింటి వద్దనే ఉన్నాడు. చెడు వ్యసనాలకు బానిసకావడంతో భార్య, బంధువులు మందలించారు. మనస్థాపం చెందిన నాగార్జున ఈనెల 16న విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటి ప్రభుత్వాసుపత్రికి, పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం : ఎస్పీ



పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

పోరుమామిళ్ల/కలసపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కు పాదం మోపుతామని ఎస్పీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన పోరుమామిళ్ల, కలసపాడు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి... రికార్డులను చెక్ చేశారు. పలు విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాటాడుతూ మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రత కోసం శక్తి టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీంలు కళాశాలలు, బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాల్లో సీక్రెట్‌గా గస్తీ తిరుగుతూ ఉంటారన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను త్వరలో ఏర్పాటు చేస్తా మన్నారు. ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినపుడు అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సీఐ, డీఎస్పీ ఆఫీసులకు వెళ్లవచ్చ న్నారు. ప్రజలకు పోలీసులకు మధ్య గ్యాప్ ఉండకూడదని ఎస్పీ పేర్కొన్నారు. సైబర్ నేరాల పట్ల ఉద్యోగులు, యువత, అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని, జిల్లాలో 42 ప్రమాద రహదారుల ప్రాంతాలను గుర్తించామని, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్, పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు తిమోతి, కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫలించిన చర్చలు... సమ్మె విరమణ

- ఐసీయల్ ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు విధుల్లోకి..



మాట్లాడుతున్న కార్మికులు

ఎర్రగుంట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఐసీయల్ ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులు రెండు వారాలుగా చేస్తున్న సమ్మెను గురువారం విరమించారు. బుధవారం కలెక్టర్ వద్ద జరిగిన చర్చలు సఫలీకృతం కావడంతో గురువారం కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఐసీయల్ గేటు వద్ద ఎన్‌డీఏ ఇన్‌చార్జి మధుసూదరెడ్డితో కేక్ కట్ చేయించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల గ్రేడ్లు పెంచేందుకు, విద్య వైద్య సౌకర్యాలు కల్పించేందుకు, కదిరివారిపల్లెలో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఐసీయల్ యాజమాన్యం ఒప్పుకున్నట్లు తెలిపారు. అలాగే తరచూ మెడికల్ క్యాంపులు పెట్టి వైద్య సేవలు అందించేం దుకు యాజమాన్యం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కూటమి కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టులో 15 టీఎంసీల నీరు నిల్వ

కొండాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 15.180 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి మెయిన్‌కెనాల్‌కు 250 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తు తం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గండి క్షేత్రంపై ప్రభుత్వ నిర్లక్ష్యం : ఎంపీ



చక్రాయపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన గండి క్షేత్రాన్ని సందర్శించి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రానికి శ్రావణమాసంలో లక్షల్లో భక్తులు వస్తుంటారన్నారు. ఆలయానికి వైసీపీ ప్రభుత్వంలో రూ.28కోట్లు మంజూరు చేసి 95శాతం పనులు పూర్తి చేశా మన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా మిగిలిన ఐదు శాతం పనులను చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తయిన ఆలయాన్ని ప్రారంభించి మూల విరాట్ విగ్రహ ప్రతిష్ఠ చేయకపోవడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

సీకేదిన్నె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ల పెంపకం చేపట్టడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో గురువారం పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, గ్రామీణ రైతులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన అనంతరం ఆసక్తితో ఆచరణలోకి తీసుకురావాలని, పెరటికోళ్ల పెంపకం ఆహార భద్రతను కాపాడుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి పెరటికోళ్లలో వచ్చే ముఖ్యమైన వ్యాధులు, నివారణ చర్యలు, టీకాల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు కోళ్ల పెంపకాన్ని ఉపాధిగా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు 500 కోడిపిల్లలను, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, సాయిమహేశ్వరి, మహేష్‌బాబు, మానస, దినేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి డీడీగా నీరజ



బాధ్యతలు చేపట్టిన డాక్టర్ నీరజ

మదనపల్లెటౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ మదనపల్లె డివిజన్ ఇన్‌చార్జి డీడీగా డాక్టర్ నీరజ బాధ్యతలు చేపట్టారు. గురువారం స్థానిక డీడీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వాల్మీకిపురం ఏడీగా పనిచేస్తున్న తాను బదిలీపై మదనపల్లెకు వచ్చానని, ఇక్కడ డీడీగా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వెళ్లడంతో ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు చేపట్టానన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు అందించే సంక్షేమ పథకాలను వారికి అందుబాటులో తీసుకెళతానన్నారు. నిరవధికంగా గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

అయినవారే వదిలేసి వెళ్లారు..

- మానవత్వం మంటగలుస్తున్న వేళ...

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజు రోజుకు మానవ సంబంధాలు దారుణంగా క్షీణిస్తున్నాయి. మానవత్వం మంటగలుపుతున్న సంఘటన ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... నాలుగు రోజుల క్రితం వైఎంఆర్‌కాలనీ అడ్రస్‌తో లక్ష్మీదేవి అనే మహిళను పక్షవాతం సోకిందని వారి కుటుంబీకులు ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. చేర్పించేటప్పుడు ఇచ్చిన అడ్రస్సుతో పాటు సెల్‌ఫోన్ నెంబరు కూడా ఫేక్ ది ఇచ్చారు. దీంతో గత నాలుగు రోజులుగా ఆ మహిళ ఆసుపత్రిలో ఒంటరిగా ఉంటోంది. ఆమెకు పక్షవాతం సోకడంతో సరిగా మాట్లాడలేక పోతోంది. అయితే ఆమెది వైఎంఆర్‌కాలనీ ఏరియా అని మాత్రం చెబుతున్నట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు. పక్షవాతం సోకిన ఆమహిళకు కనీసం ఒక అటెండెంట్ లేకుండా వుండటంతో ఆసుపత్రి సిబ్బంది ఆమె కాలకృత్యాలు తీర్చడం లాంటి పనులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన అడ్రస్సుకు ఫోన్ నెంబరుకు ఫోన్ చేస్తే అవి పనిచేయకపోవడం బట్టి వారు ప్లాన్ ప్రకారం ఆమెను అక్కడ వదిలేసి వెళ్లారని అర్థమౌతోంది. అనారోగ్యంతో వున్న ఆ మహిళ బంధువులు వచ్చి ఆమె బాగోగులు చూసుకోవాలని.. లేకుంటే ఆమె వివరాలు తెలిశాక వారి కుటుంబీకులను విచారించి కేసులు కట్టవలసి వస్తుందని ఔట్‌పోస్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు అయినా ముందుకు రావాలని ఆసుపత్రి సిబ్బందితో పాటు ఔట్‌పోస్టు పోలీసులు కోరుతున్నారు.



ఆసుపత్రిలో వదిలేసి వెళ్లడంతో చింతిస్తున్న లక్ష్మీదేవి

నేడు డయల్ యువర్ డిపో మేనేజర్

కడప మారుతీనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలపై ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు తెలిపారు. నగర ప్రజలు, ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు, సలహాలను 9959225774 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా గానీ తెలపాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చక్రాయపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై 40ఏళ్లలోపు ఉన్నవారు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కులిస్ట్, ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక సెట్ జిరాక్స్‌లతో చక్రాయపేట ఐటీఐ కళాశాలకు వస్తే ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

22న చెస్ టోర్నమెంటు

కడప స్పోర్ట్స్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 22వ తేదీ ఆదివారం అష్రఫ్-ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న లిటిల్‌ఫ్లవర్ స్కూలులో ఈ టోర్నమెంటు జరుగుతుందని వెల్లడించారు. విజేతలకు ట్రోఫీతో పాటు మెడల్స్ అందించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక చెస్ క్రీడాకారులు 8341255151 నెంబరును సంప్రదించాలని కోరారు.

మహిళలకు రక్షణ కవచం.. శక్తియాప్ : సీఐ

కమలాపురం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మహిళలకు శక్తియాప్ రక్షణ కవచంగా ఉంటుందని సీఐ రోషన్ తెలిపారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల, హైస్కూలులో గురువారం శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తియాప్ మహిళలకు ఆపద సమయంలో అండగా ఉంటుందన్నారు. ఎస్‌ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ సమాజంలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా మహిళలు కూడా అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోలార్ పలకలతో విద్యుత్ ఆదా

● ప్రధానమంత్రి సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజనపై ప్రజలకు అవగాహన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప నాగరాజుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి పైకప్పుపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం వలన పర్యావరణ కాలుష్యం తగ్గించడంతో పాటు ప్రతి వినియోగదారుడు సోలార్ ఉత్పత్తి చేసుకోవడం వలన ఇంటి విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గుతుందని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. గురువారం స్థానిక ఈఈ కార్యాలయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 కేడబ్ల్యూ సోలార్ అమర్చుకొనుటకు రూ.63వేలు ఖర్చుచేస్తే అందులో రూ.30వేలు సబ్సిడీ లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతుందన్నారు. అలాగే 2కేడబ్ల్యూనకు రూ.1.26లక్షలు ఖర్చు అయితే రూ.60వేలు సబ్సిడీ, 3 కేడబ్ల్యూకు రూ.1.90 లక్షలు ఖర్చు అయితే రూ.78వేలు సబ్సిడీ, ఆపై ఎంత ఏర్పాటు చేసుకున్నా రూ.78వేల సబ్సిడీ మాత్రమే వస్తుందన్నారు. సబ్సిడీ పోను మిగతా అమౌంట్‌కు బ్యాంకులు 6.5శాతం వడ్డీతో లోను ఇస్తారని, ఈఎంఐ రూపంలో చెల్లిస్తే ఐదేళ్లకు పూర్తయి తర్వాత బిల్లు ఉచితంగా ఉన్నట్లేనన్నారు. దాదాపు 25ఏళ్ల పాటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈలు, ఏఈలు, బ్యాంకు అధికారులు, స్టెప్ మేనేజర్, ఓఅండ్‌ఎం స్టాఫ్ పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

● నేటి ఆశాల ధర్నాను దిగ్విజయం చేయండి ● ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న మరియమ్మ

కడప మారుతీనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పనిదినాన్ని కూటమి ప్రభుత్వం పది గంటలకు పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల శ్రమను దోచి పెట్టుబడిదారీ వర్గాలకు ఊడిగం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను సమర్థిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న పది గంటల పని విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే స్కీం వర్కర్లలో పని చేస్తున్న ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు పని వత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా ఈనెల 20వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏఐటీయూసీ నాయకులతో కలిసి నిరసన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆశా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోశాధికారి అమ్ములు, సరస్వతి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి

● ఎమ్మెల్యే ఆర్.మాధవి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజల ఆకాంక్ష మేరకు పని చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ రికార్డుల ప్రదర్శన : ఆర్డీవో

కడప కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్ర జ్యోతి): కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీన రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని రకాల రెవెన్యూ రికార్డుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో జాన్ ఇర్విన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగే ఈ ప్రదర్శనను ప్రజలు సందర్శించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరభద్రస్వామి ఆలయ ప్రాంతం, శ్రీనివాసహాల్, పాత ఏరియా ఆసుపత్రి వెనుక ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పట్ల ప్రతిభ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం ఇంగ్లీష్ మీడియానికి సంబంధించి మిగిలిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష 25వ తేదీ ఉదయం 10 నుంచి 12గంటల వరకు కడప చిన్నచౌక్‌లోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

దీర్ఘకాలిక రోగాలపై సర్వే



సింహాద్రిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లోమడ గ్రామ సచివాలయ పరిధిలోని లోమడ, కడపనాగాయపల్లి, కాంబల్లి గ్రామాల్లో గురువారం ఎన్‌సీడీ 3.0 దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్‌పై సర్వే నిర్వహించారు. ఈ సర్వేను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక వైద్య విభాగ బృందం నిర్వహించినట్లు హెచ్‌ఈఓ ఓబులేసు తెలిపారు. ఈ బృందంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు డాక్టర్ లక్ష్మీకర్, డాక్టర్ విజయ్, డాక్టర్ రాహుల్, డాక్టర్ నరసింహ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ శోభ, డాక్టర్ సౌగంధిక ఉన్నారు. కోవరంగుట్టపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ ప్రత్యూష, సిబ్బంది సహకరించారు.

ఫీజులను నియంత్రించాలి

వేంపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీ ఎక్కువైందని, నియంత్రించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కోకన్వీనర్ దాదాపీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికివందనం పథకం కింద రూ.13వేలు ఇస్తుండడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజులను అమాంతం పెంచి సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

పారదర్శకత పెంపొందించాలి


కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేముల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపులలో ఆర్థిక వ్యవహారాలను సంఘం పుస్తకాల్లో తప్పక నమోదు చేయాలని, సంఘ సభ్యుల మధ్య మరింత పారదర్శకత పెంపొందించాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు సూచించారు. గురువారం మండలంలోని గొందిపల్లె గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు ప్రతి సభ్యురాలికి తెలియాలని, అప్పుల చెల్లింపులు, రుణాల మంజూరులో ఎలాంటి అనుమానాలకు చోటులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రామగిరిబాబా ఆరాధన మహోత్సవాలు

కడప మారుతీనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్కాయపల్లె, అంబాభవానీ వీధిలో వెలసిన రామగిరిబాబా ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐదురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి రుద్రాభిషేకం, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామగిరిబాబా సేవా సమితి అధ్యక్షుడు రాజభాస్కర్‌రావు షిండే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లాఅధ్యక్షుడు బొమ్మన విజయ్, ప్రవీణ్, సురేంద్ర, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

యోగాడేను విజయవంతం చేయాలి : కమిషనర్

పులివెందుల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ పులివెందుల వైఎస్సార్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న యోగాడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రాముడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజల్లో యోగాభ్యాసం పట్ల అవగాహన పెంచడానికి చేపట్టిన నెలరోజుల యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

అందరూ భాగస్వామ్యం కావాలి

లింగాల,జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యోగా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. లింగాల మండలం ఇప్పట్ల ప్రతిభ గురుకుల పాఠశాలలో ఈనెల 21న యోగాడే నిర్వహించనుండడంతో గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, ప్రజలు, విద్యార్థులు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ నరేంద్ర, ఆర్ఐ గంగాధర్‌యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు యోగాతో ఆరోగ్యం

వేంపల్లె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం వలన ఆరోగ్యం సిద్ధిస్తుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం వేంపల్లె శ్రీచైతన్య పాఠశాలలో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, విద్యార్థులతో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

యోగా అభ్యాసం చేయాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రిటైర్డ్ అధ్యాపకుడు ఆదినారాయణ తెలిపారు. గురువారం యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగా అభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆసనాల గురించి వివరించారు. ప్రతిరోజు ధ్యానం, యోగా అభ్యాసం చేయడం వల్ల మంచి ఆరోగ్యం, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ అధికారి గోవిందరెడ్డి, వ్యాయామ అధ్యాపకురాలు అరుణకుమారి పాల్గొన్నారు.

మానవాళికి సంపూర్ణయోగం

సింహాద్రిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): యోగాతో సర్వమానవాళికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని యోగా మాస్టర్ ట్రైనర్ ధర్మవరం నరసింహులు అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సింహాద్రిపురం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సతీష్ కన్నా, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, నరసింహులు, ఆంజనేయులు, గణేష్ చంద్ర, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


సింహాద్రిపురంలో యోగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : బీటెక్ రవి


ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న బీటెక్ రవి

పులివెందుల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభు త్వ పథకాలు అందేలా చూస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారి వ్యక్తి గత సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చే సమస్యల అర్జీలు ఎప్పటిక ప్పుడు పరిష్కారమయ్యేలా చొరవ చూపుతామన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి పుట్టినరోజు


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కమలాపురం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇంత మంది కార్యకర్తల మధ్య ఎమ్మెల్యే పుట్టిన రోజు నిర్వహించడం తనకు చాలా సంతోషంగా ఉందని నరసింహారెహారెడ్డి అన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాదాపు 100 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. అలాగే నగర పంచాయతీపరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయినరసింహారెడ్డి, ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పాతబస్టాండు కూడలిలో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఆకుల ప్రసాద్, పాలగిరి పెద్దసుబ్బారెడ్డి, రామకోటిరెడ్డి, మన్నూరు అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

సీకేదిన్నె, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పుట్టిన రోజు వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేశారు. అదే విధంగా వృద్ధాశ్రమంలో పండ్లు పంచిపెట్టారు.

వల్లూరులో అన్నదానం

వల్లూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి జన్మదిన వేడుకలను గురువారం దిగువపల్లెలో సుధా మదన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కడప బ్లైండ్ స్కూలులో పుత్తా సాయినరసింహారెడ్డి, సుధా మదన్‌మోహన్‌రెడ్డి అన్నదానం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

● నియోజకవర్గ పరిశీలకుడు బందరు మనోహర్ నాయుడు

కమలాపురం రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని కమలాపురం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బందరు మనోహర్‌నాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలు, కమలాపురం నగర పంచాయతీతో కలిపి మొత్తం 9మంది పరిశీలకులతో పాటు ఆరు మండలాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ప్రతి మండలానికి ఒక పరిశీలకుని నియమించారని, వీరు ఆ మండలంలోని అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే ప్రతి కార్యకర్త తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అందరికీ అండగా ఉంటామని అధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వలిగట్ల వెంకటరమణ, బట్టబుగ్గయ్య చౌదరి, కమలాపురం నగర పంచాయతీ ఎన్నికల పరిశీలకుడు తుమ్మలూరు మల్లికార్జున, పరిశీలకులు ఎస్.పట్టాభిరెడ్డి, పాపయ్యగారి వెంకటరమణ, సింగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, పాలకొండు సుధారాణి, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి పోరాటం

● ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలు : తులసిరెడ్డి


వేంపల్లెలో పండ్లు, బ్రెడ్లు అందిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యానికి- నియంతృత్వానికి, లౌకిక వాదానికి-మత మౌఢ్యానికి, గాంధేయ వాదానికి-గాడ్సే వాదానికి మధ్య సైద్ధాంతిక పోరాటం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో రాహుల్ గాంధీ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. దేశంలో అచ్చేదినాల బదులు చచ్చేదినాలు దాపురించాయన్నారు. మోడీ ప్రభుత్వం ఏపీకి తీరనిద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, సుబ్రమణ్యశర్మ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకుడాలలో...

లింగాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకుడాలలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎం.కళ్యాణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో...

కడప కలెక్టరేట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభ సభ్యుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్‌గౌడ్, మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫిక్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

పెండ్లిమర్రి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం సీఐ చల్లనిదొర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోక్సో చట్టం, గుడ్ టచ్ బాడ్‌టచ్, సైబర్ క్రైమ్, క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, హెల్ప్‌లైన్ ఫోన్ నెంబర్స్, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు, నార్కోటిక్ డ్రగ్స్, ట్రాఫిక్ అవేర్‌నెస్ తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు.

గృహాలు సరే.. రోడ్లు నిర్మించరా..?



రహదారులు లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం

పోరుమామిళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేస్తున్నా రోడ్లు మాత్రం నిర్మించకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ హయాంలో మంజూరైన జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు నిధుల కొరత నత్తనడకన సాగిన విషయం విదితమే. దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఎన్టీఆర్ కాలనీ పేరుతో గృహ నిర్మాణాలను వేగవంతం చేయడంతో మంజూరైన గృహాలు దాదాపు 90 శాతం పూర్తి చేసుకునే స్థాయికివచ్చాయి. అలాగే ఎస్సీ ఎస్టీ బీసీలకు రూ.50వేలు అదనంగా కేటాయించడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు. పోరుమామిళ్ల, రంగసముద్రం మినహా మిగిలిన పంచాయతీల్లో దాదాపు 90 శాతం గృహాలు పూర్తయ్యాయి. కాకపోతే రహదారుల నిర్మాణం చేపడితే తమకు పూర్తిస్థాయిలో సౌకర్యం కలుగుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు పోరుమామిళ్ల మండలంలో 1339 పక్కాగృహాలు మంజూరు కాగా రెండు ఎన్ఎస్‌లో ఉండగా మరో 115 బీబీఎల్ దశలో ఉండిపోయాయి. 24 లెంటల్ లెవల్‌లో, 160 రూఫ్‌లెవల్‌లో, 20 శ్లాబు లెవెల్‌లో ఉన్నాయి. 907 గృహాలు పూర్తయ్యాయి. లబ్ధిదారులు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలకు సంబంధించి ఎక్కువ గృహాలు మంజూరయ్యాయి. కాలనీల్లో రోడ్లు, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయలు లేక చీకట్లోనే జీవనం సాగిస్తున్నామని వాపోతున్నారు. కాలనీలకు ఏర్పాటు చేసిన పైపులైనును ఇతరులు కూడా దిగువన ఉన్న వారు పైపులైను తీసుకోడం వల్ల ఇబ్బంది ఉందని చెబుతున్నారు.

హౌసింగ్ ఏఈ ఏమన్నారంటే: ఈ విషయమై హౌసింగ్ ఏఈ నాగజ్యోతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీలకు అదనంగా రూ.50వేలు కేటాయించిన తరువాత గృహనిర్మాణాలు వేగవంతమయ్యాయన్నారు. దాదాపు 90శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని రంగసముద్రం, పోరుమామిళ్లలో నిర్మాణాలు జరగాల్సి ఉందన్నారు. అనుకున్నలక్ష్యాలను త్వరగా సహూర్తి చేస్తామన్నారు. గృహాల వరకు మాత్రమే తమకు ఆదేశాలున్నాయని రహదారులు సంబంధిత శాఖ వారు చేపట్టాల్సి ఉందన్నారు.

గాలీవాన వస్తే రెండు రోజులు ఇబ్బందిగా ఉంటుంది

గాలీవాన వస్తే కరెంటు కాలనీలో రెండు రోజులు కరెంట్‌లేక తీవ్ర వీధిలైట్లు కొన్ని చోట్ల వెలుగుతుండగా మరికొన్ని చోట్ల వెలగడంలేదు. అక్కడక్కడా పైపులైన్లు కూడా లీకవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

- తిరుమలయ్య, రంగసముద్రం

ఎస్టీ నిరుపేదలు సమస్యలుంటే తెలుపవచ్చు



ఎస్టీ నిరుపేదల సమస్యలపై అర్జీలు ఇస్తున్న ఎన్టీఎఫ్ నాయకులు

కొండాపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట సచివాలయంలో ఎస్టీ కులంలోని నిరుపేదలు ఏవైనా సమస్యలుంటే అధికారులకు తెలుపవచ్చని ఎంపీడీవో ఏవో సుబ్బయ్య తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెంది అర్హులై కూడా రేషన్‌కార్డు, పెన్షన్ ఇతర ప్రభుత్వ పథకాలు రాకపోతే అర్జీలు ఇవ్వాలని తెలిపారు. రేషన్‌కార్డులు, పెన్షన్లు తమకు లేవని పలువురు సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై ఏవోకు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఎఫ్ నేతలు నాగన్న, డేరాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సర్పంచ్

పోరుమామిళ్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను పోరుమామిళ్ల మేజరు పంచయాతీ సర్పంచ్ యనమల సుధాకర్ కలిసి ఆయనను సన్మానించారు. పోరుమామిళ్ల పోలీసుస్టేషన్‌ను ఎస్పీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎస్పీని కలిసి పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని పరిస్థితులను వివరించారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



చాపాడులో కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి

బద్వేలు/చాపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో శనివారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పట్టణ కమిటీ అధ్యక్షుడు పగడాల నరసింహ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి జరుగుతుంద న్నారు. సాంబయ్య, శివ పాల్గొన్నారు. కాగా చాపాడు మండలంలోని పల్లవోలు వద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమంలోని వృద్ధులకు మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్‌రెడ్డి గురువారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 55వ పుట్టినరోజు సందర్భంగా సుధాకర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చాపాడు మాజీ సర్పంచ్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు మున్సిపల్ ఏఈగా నిరంజన్‌రెడ్డి



మైదుకూరు రూరల్ జూన్ 19(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మున్సిపల్ ఏఈగా నిరంజన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. నిరంజన్‌రెడ్డి గతంలో మైదుకూరు మున్సిపల్ ఏఈగా పనిచేశారు. అప్పట్లో మున్సిపల్ ఛైర్మన్ టేబుల్ ఎజెండాలో ద్వారా కౌన్సిల్ తీర్మాణంలో పెట్టి నిరంజన్‌రెడ్డి బదిలీపై పంపించారు. మళ్లీ ఆయన మైదుకూరుకు బదిలీపై రావడంపై పలువురు గుసగుసలాడుకొంటున్నారు.

పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలుపట్ల హర్షం

జమ్మలమడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలుపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు బాబు హర్షం వ్యక్తం చేశారు. అన్ని శాఖల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ కూటమి ప్రభుత్వం జీవోఎంఎస్‌నెం.19 జారీ చేయడం సంతోషకరమన్నారు. 2002లో మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు వచ్చాయని, నేడు పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ ఆయన ఫలితంగా వచ్చిందని తెలిపారు.

విద్యార్థినులకు ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులను కళాశాలకు వెళ్లేటపుడు దారిలో ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ చదువకుండా సెల్‌ఫోన్లు చూసుకోవడం, టీవీలు చూడడం మానాలన్నారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. అనంతరం ఈవ్‌టీజింగ్, యాప్, డయల్ 100, 112 సైబర్ క్రైం ఇతరత్రా విషయాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ముద్దనూరు జూన్19(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు గురువారం సీఐ దస్తగిరి సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు.మొబైల్ ద్వారా 80శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను అసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని వాటిపై అవగాహన పెంచుకొని మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిమోతి

కలసపాడులో: సైబర్ నేర గాళ్ల ట్రాప్‌లో పడొద్దని విద్యార్థినులు, ఉపాధ్యాయులకు కలసపాడు ఎస్ఐ తిమోతి సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలలోని బాలికలకు డయల్ 112, ఈవ్‌టీజింగ్, సమాజంలో మహిళలలపై జరిగే నేరాలు,సైబర్ క్రైమ్ నేరాలు, సోషల్ మీడియాలో మహిళలను, ఆడపిల్లలను ఎలా ట్రాప్ చేస్తారో వివరించి వాటిపట్ల తమసహాయం తీసుకోవాలని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ వెంకటరెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల బారినుంచి విద్యార్థులను కాపాడటానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని త్రీటౌన్ ఎస్ఐ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక రెండవ వార్డు మున్సిపల్ హై స్కూల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లైగింక వేధింపులకు గురైనప్పుడు 1930 సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేస్తే వారు మీకు సహాయ పడతారన్నారు. అలాగే 100,112 నెంబర్లుకు ఫోన్ చేస్తే పోలీసులు నేరుగా సహాయం అందిస్తారన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు పాఠశాల హెడ్‌మాస్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరయ్యస్వామి ఉత్సవాలు

చాపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లె గ్రామంలో అవధూత వీరయ్యస్వామి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు భజనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వీరయ్యస్వామికి టెంకాయలు కొట్టి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన ఎడ్లకు బహుమతులు పంపిణీ చేశారు.

ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

● జిల్లా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే వరద



జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలపై రోగులను విచారిస్తున్న ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు , జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను ఇంకా బాగా మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వైద్య అధికారులకు సూచించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓపీతోపాటు అన్ని వార్డులలో పేషంట్లకు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులకు అందించే ఆహారం నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు కానీ సిబ్బందికానీ మర్యాదపూర్వకంగా పలుకరించాలన వారిని అగౌరవ పరిచేరీతిలో వ్యవహరిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. రోగుల వద్ద సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని ఇది మానుకోకుంటే ఉద్యోగాలు ఊడుతాయని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేలు శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బ్రహ్మంగారిమఠం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో చేరే విద్యార్థులు జూన్ 22 లోపు తమ ఆధార్ కార్డుతో దరఖాస్తును పాఠశాలలో అందించాలని ప్రిన్సిపాల్ ఉమామహేశ్ తెలిపారు. మండలంలోని చుట్టుపక్కల ఉన్న గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమామహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

కలసపాడు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి బాధ్యతగా ప్రజలకు సేవలందించాలని ఎంపీపీ నిర్మలాదేవి, ఎంపీడీఓ మహబూబ్‌బి సూచించారు. గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని తమ శాఖల సమాచారాన్ని చదివి వినిపించారు. గ్రామ రెవిన్యూ అధికారులు సచివాలయంలో రోజుకు రెండుగంటలు అయిన అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సూచించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని ఎంఈఓ మస్తాన్‌వలి కోరారు.

దళిత సైన్యం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దళితసైన్యం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు దళిత సైన్యం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.ఆశీర్వాదం తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆదేశాల మేరకు నూతన కమిటీని నియమించామన్నారు. జిల్లా అధ్యక్షునిగా గాలిపోతుల క్రిష్టఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దల ఓబులేసు, ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.రాజు, మండలాధ్యక్షుడు ఆకుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా గురవయ్యలను నియమించామన్నారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో సాంకేతిక సమస్యలతో చాలా మందికి డబ్బులు పడడం లేదని వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు.

స్కూలు బ్యాగులు పంపిణీ



బి.కోడూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకవారిపల్లె పాఠశాలలో గురువారం ఎంఈవో సునీల్ కుమార్ విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకవారిపల్లె పాఠశాలలో ఇంత వరకు 1 నుంచి 7తరగతుల వరకే ఉన్నదని, ఈ సంవత్సరం నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసి జిల్లా పరిషత్ హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయిందన్నారు. ఉపాధ్యాయులు మంచి పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులందరికీ విద్యార్థికిట్ తల్లికి వందనం అందిందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

బద్వేలు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులను నివారించవచ్చని హెల్త్ అసిస్టెంటు జనార్ధనరావు అన్నారు. తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నందిపల్లె గ్రామంలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా మలేరియాపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు జ్యోత్స్న ఏఎన్ఎం, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభించాలి

జమ్మలమడుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విభజన అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికి కడప ఉక్కు ఫ్యాక్టరీ పనులు చేపట్టలేదని కేవలం ఎన్నికల సమయంలో మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గాలేరు- నగరి, హంద్రీ-నీవా, తెలుగు గంగ , రాజోలి ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం తదితర అంశాలపై జూన్ 21 నుంచి 24వ తేదీ వరకు బద్వేలులో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మూలే వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, లక్ష్మినారాయణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బద్వేలులో 5 వేల మందితో యోగా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన బద్వేలు పట్టణంలోని ఎస్‌బీవీఆర్ కళాశాల గ్రౌండ్‌లో 5వేల మందితో నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ కుటుంబ సభ్యులతో సహా పాల్గొనాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల వారు, ఉపాధ్యాయులు, ఇతరులు అందరు యోగా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గించి మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బద్వేలు, గోపవరం తహశీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు , జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో యోగా డేను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రపంచ యోగా దినోత్సవంను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరులో జూన్ 21 యోగాడేను అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో, నామా ఎరికలయ్య ఆశ్రమంలో, టీటీడి కళ్యాణ మండపంలో ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి పట్టణ ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని కోరరు.

మైదుకూరు రూరల్‌లో : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి సచివాలయం, కళాశాల, పాఠశాలలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.

ఒత్తిడిని జయించే సాధనం యోగా



కాకిరేణిపల్లెలో యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు యోగాను ఆచరించడం వలన ఆరోగ్య పరిరక్షణతోపాటు ఒత్తిడిని జయించే సాధనంలా పనిచేస్తుందని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. గురువారం చౌడూరు సచివాలయ పరిధిలోని కాకిరేణిపల్లె గ్రామంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్‌వో గౌతమి, ఏఎన్ఎంలు గోవిందమ్మ, వేదవతి, ఆశా కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, పద్మావతి, సంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న సిబ్బంది, భక్తులు

జమ్మలమడుగులో: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ అధికారి మోహన్, పండితులు తెలిపారు. గురువారం జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాసనాలు ప్రతి వాడ, ప్రతి ఇంటికి స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు చేయాలని సూచించారు. అందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో తామంతా మరికొందరు భక్తులతో ప్రతి రోజు ఉదయం యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రారంభించామన్నారు. ఆలయాల సమీపంలో ఉన్న భక్తులు, అధికారులు యోగాసనాలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.

పోరుమామిళ్లలో : యోగాపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆ కళాశాలలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ మర్రి శ్రీనివాసులు హాజరై యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పుల్లీడు గ్రామంలో కూడా అధికారులు యోగా కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

మహా గురుకుల పాఠశాలను పరిశీలించిన ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లె గ్రామంలో రూ.25 కోట్లతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా గురుకుల పాఠశాలను గురువారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా 15 రోజుల్లోపు .పాఠశాలల్లోని మౌలిక వసతులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరును ఆయన ఆదేశించారు. అలాగే పాఠశాల ఆవరణలో సీసీ రోడ్లు, పాఠశాల నుంచి తోట్లపల్లె మెయిన్‌రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ఇటీవల జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్‌లు పాఠశాలను సందర్శించి జూలై మొదటి వారంలో ప్రారంభించడం జరుగుతుందని చెప్పిన నేపథ్యంలో పాఠశాలను సందర్శించినట్లు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ డిప్యూటీ ఇంజనీరు మధు, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, మేకల సుధాకర్, మాజీ ఎంపీటీసీ రమేశ్, సురేంద్ర, తోట్లపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికపై విచారణ

ముద్దనూరు జూన్19(ఆంధ్రజ్యోతి):స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెనికెలపాడు సర్పంచ్ ఎన్నిక పై డీఎల్‌పీవో తిమ్మక్క గురువారం డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, పెనికెలపాడు కార్యదర్శి సౌభాగ్యలక్ష్మి తో విచారణ చేపట్టారు. గత 2021 వ సంవత్సరం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన వైసీపీ సర్పంచ్ యు. సుధాకర్ అనర్హుడని, వివిధ క్రిమినల్ కేసు అతని పై ఉన్నాయని అప్పటిలోనే ఓటమి చెందిన పి.వేణుమోహన్ కోర్టును ఆశ్రయించాడు. ప్రస్తుతం కోర్టు నుంచి అధికారులకు నోటీసులు రావడంతో విచారణ చేపట్టారు.అయితే నామినేషన్ సమయంలో కేసులకు సంబంధించి నామినేషన్ దాఖలు సమయంలో తమకు ఎటువంటి పత్రాలు ఇవ్వలేదని, తమ వద్ద దానికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని, కేసు కోర్టు పరిధిలో ఉన్నందున సమస్యను పరిష్కరించలేక పోతున్నామని డీఎల్‌పీవో తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటినది బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్నలు పేర్కొన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.26,85,882 విలువగల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎం సహాయనిధి ఆపన్నహస్తం అందిస్తున్నారని, సీఎం సహా యనిధి అందుకున్న పేదలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సోలార్ పలకల ఏర్పాటుపై అవగాహన

బద్వేలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద సోలార్ పలకలు ఏర్పాటుపై అవగాహన కలిస్తున్నట్లు ఆ శాఖ ఈఈ భరణి కృష్ణ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.